ఇంటర్‌వ్యూ జరుగుతోంది.

బలి పశువులా ఒక్కొక్కర్నే లోపలికి నెడుతున్నాడు ప్యూను....

సారథి నిట్టూర్చాడు. ముఖానికి పట్టిన చెమటని జేబు రుమాలుతో తుడుచుకున్నాడు. చుట్టూ పరికించి చూశాడు.

తన చుట్టు ప్రక్కల దాదాపుగా ఓ వందమంది అభ్యర్థులు కుర్చీలలో కూర్చొని వున్నారు. దూరంగా గార్డెన్‌లో చెట్లక్రింద కొంతమంది నిలబడి సిగరెట్లు తాగుతూ పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నారు. మరి కొంతమంది గార్డెన్‌లో ఎత్తుగా పెరిగిన పచ్చిక మీద కూర్చొని జనరల్ నాలెడ్జి పుస్తకాలు తిరగేస్తున్నారు.

అయితే - అందరి చేతుల్లోనూ కష్టపడి చదివి సంపాదించిన డిగ్రీ సర్టిఫికెట్స్ భద్రంగా దాచిన ఫైల్సున్నాయి. అందరి ముఖాల్లోనూ ఆందోళన కొట్టొచ్చినట్లు కనబడుతోంది. అందరి మనసుల్లోనూ ఏదో ఆశ.

ఎవరికి వారు తమకి సెలక్షన్ వస్తుందని లోపల్లోపల ఆశపడుతున్నారు. అవును మరి! మనిషికి ఆశ ప్రధానం. ఆ ఆశ లేకపోతే మనిషి ముందుకు నడవలేడు. ఆశ మనిషికి ప్రాణం. నిరాశా నిస్పృహల జీవితం ఏదీ సాధించలేదు. అందుకే ఎవరికి వారు తామీ ఇంటర్‌వ్యూలో తప్పక జయిస్తామనే ఆశతో, ఎంతెంతో దూర భారాల నుండి, ఎంతో శ్రమకోర్చి ఇంటర్వ్యూకి రావడం తటస్థించింది. కాని - ఇంతమందికీ ఉద్యోగాలు వస్తాయా? ఉద్యోగం వరించిన వారిముఖాల్లో సంతోష రేఖలు! వరించని వారి ముఖాల్లో విషాదచ్ఛాయలు! విధి ఎంత విచిత్రమైనది! ఎంత బలీయమైనది!....

ఆలోచించలేక పోయాడు సారథి.

సారథి కడుపులో ఆకలి పెచ్చరేగిపోతోంది.

శరీరం అలసటతో విశ్రాంతి కావాలని కోరుకొంటోంది. కాఫీ నీళ్ళయినా కడుపులో పోసుకోవాలనిపిస్తోంది.

కాని తన పేరెప్పుడు పిలుస్తారో తెలీదు. తను కాఫీకి వెళ్ళిన సమయంలోనే తనకి పిలుపొస్తే?

అమ్మో! ఇంకేమైనా వుందా? ఇంతదూరం శ్రమపడి వచ్చి, ఇంతసేపూ ఆకలికి వోర్చి నిరీక్షించి, ఆఖరి ఘడియల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకొనే అవకాశాన్ని కూడా దూరం చేసుకోవడం ఎలా? ఈ అవకాశం పోతే మళ్ళీ వస్తుందా?

ఆ ఆలోచన రాగానే వొళ్ళు సన్నగా వొణకటం ప్రారంభమైంది - సారథికి. అందుకే కాఫీ త్రాగాలనే ప్రయత్నాన్ని విరమించుకొని, వరండాలో ఓ మూలగా వున్న కుండలోని నీళ్ళు గ్లాసుతో ముంచుకొని, కడుపు నింపుకొని మళ్ళీ వచ్చి యథాస్థానంలో కూలబడిపోయాడు.

ఉదయం నుండి కడుపులో ఏమీ పడకపోవడం వల్లా, ఖాళీ కడుపులో అతి చల్లని మంచినీళ్ళు అకస్మాత్తుగా పడటం వల్లా, కళ్ళు తిరిగినట్లైంది సారథికి. శీతలం కమ్మేసినట్లు, వొళ్ళంతా స్నానం

నాణానికి మూడో వైపు

డాక్టర్ టి. విమల

720

చేసినట్లు చెమట తడిపేసింది. కాస్త కడుపులో మంటయితే చల్లారిందిగాని నీళ్ళు ఆకలిని హరించ గలదా? నీరసం నరనరంలోకీ వ్యాపించుతున్నట్లు అనిపించింది సారథికి.

అయినా సారథి నీరసంతో నీరుకారిపోవడం లేదు. ఆశతో ఎదురుచూస్తున్నాడు - తనకి పిలుపు ఎప్పుడు వస్తుందా - అని.

కాని - అంతలోనే నిరాశ!

అవును మరి! ఉన్నవి నాల్గు పోస్టులు. వచ్చిన అభ్యర్థుల సంఖ్య - రెండువందల పాతిక మంది. అమ్మో! ఎంత పోటీ! ఇంత మంది హోరా హోరీగా 'ఢీ' కొంటున్న ఈ పోటీలో తనకు విజయం లభిస్తుందా? ఆ నాల్గు ఖాళీల్లో ఒక ఖాళీ తనని వరిస్తుందా? ఏమోమరి! తన అనుమానాన్ని కాలమే పరిష్కరించాలి.

"సారథీ! సారథీ"

పిలుస్తున్నారు ఎవరో.

ఆలోచనలనుండి ఉలిక్కిపడి చుట్టూ చూశాడు సారథి - తనని పిలిచినది ఎవరా అని.

ఇంకెవరు? దేవుడి దర్శనం కోసం పిలుస్తున్న పూజారిలాంటి ప్యూను.

అప్పటికే ఆలస్యమైపోయినట్లు కుర్చీలోంచి లేచి నిలబడి, చేతిలో వున్న ఫైలుని జాగ్రత్తగా గుబుక్కున చంకలో పెట్టుకొని, పరుగులాంటి నడకతో ప్యూను ముందు వాలాడు సారథి.

"వెళ్ళు" స్ప్రింగు డోర్ చేత్తో పట్టుకొని తనని లోపలికి నెట్టాడు ఆఫీసు ప్యూను.

సింహం బోనులోకి అడుగుపెట్టబోతున్న మేక పిల్లలా - భయం భయంగా లోపలికి అడుగు పెట్టాడు సారథి.

భయం భయంగానే చుట్టూ కలయజూశాడు.

విశాలమైన గదిలో - మొజాయిక్ చేయబడిన గదిలో - ఖరీదైన టేబులూ - దాని చుట్టూ ఖరీదైన కుషన్ కుర్చీలూ—

ఆ కుర్చీలలో ఒక ప్రక్కన ముగ్గురు కూర్చొని వున్నారు. వారిలో మధ్య కూర్చొన్న ఆయనకి షుమారు నలభై అయిదు సంవత్సరాలుండవచ్చు. ఎత్తుగా - ఎర్రగా - లావుగా - మిగల పండిన జామ పండులా వున్నాడు. బట్టతల - గోల్డు ఫ్రేం కళ్ళద్దాలూ - పెద్ద పెద్ద మీసాలూ - కోటేరేసిన ముక్కూ - నల్లని సూటూ - ఠీవిగా దర్పంగా వున్నాడు. ఆయన పేరు రాజశేఖరం. ఆఫీసు హోదా ప్రకారం ఆయన జనరల్ మేనేజరు ఆ కంపెనీకి. రాజశేఖరానికి అటూ యిటూ కూర్చున్నవారు కూడా వయసు పండినవారే! కాని - చాలా సాదాగా వున్నారు.

సారథి వాళ్ళని చూస్తూనే రెండు చేతులెత్తి నమస్కారం చేశాడు - అతి వినయంగా.

కాని - నిలబడ్డ చోటునుండి అంగుళం ముందుకు కదల్లేదు.

"కమాన్ మై డియర్ బోయ్....కమాన్" అన్నాడు రాజశేఖరం - నవ్వుతూ.

గబగబా ముందుకు నడిచాడు సారథి. కాని కూర్చోలేదు.

"కమాన్....టేక్ యువర్ సీట్" మళ్ళీ రాజశేఖరమే అన్నాడు.

"థాంక్యూ సర్స్" అన్నాడు.

రాజశేఖరం సారథిని క్రిందినుండి పైకి ఒకసారి చూశాడు. ఆ వెంటనే తన ప్రతిబింబాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. తనకూ ఎదురుగా కూర్చున్న కుర్రాడికీ ఏవో పోలికలు వున్నట్లు అనుభూతి చెందాడు.

ఒక వేళ....ఒక వేళ....

రాజశేఖరం ఆలోచనలు పలురకాలుగా దారి తీస్తున్నాయి. నో....నో అటువంటిదేమీ కాదు.... అని తనని తాను సముదాయించుకున్నాడు. తన ఆలోచనల్ని అదుపులోకి తెచ్చుకున్నాడు.

'చాకులాంటి కుర్రాడు' అని మాత్రం తన మనసులో అనుకున్నాడు రాజశేఖరం. ఆ తర్వాత బుర్ర గోక్కున్నాడు. ఏదో మరిచిపోయిన వాడిలా చేతిలోవున్న పెన్సిల్‌ని నోట్లో పెట్టుకుని పళ్ళతో కొరుకుతూ ఆలోచిస్తూ వుండిపోయాడు కాసేపు. ఆ తర్వాత ఓ ఫైలు తీసుకొని, అటూ యిటూ కాస్సేపు తిరగేసి, మళ్ళీ సారథి ముఖంలోకి చూసి, మళ్ళీ ఆలోచిస్తూ వుండిపోయాడు.

సారథికి అయోమయంగా తోచింది. తను వచ్చి అయిదు నిముషాలు దాటిపోతున్నా తననెవరూ ఏమీ అడగటం లేదు. ఎందుకు అడగటం లేదు? తనని అసలు అడగటం అనవసరమనుకున్నారా? తనీ ఉద్యోగానికి అనర్హుడా? ఆలోచిస్తున్నాడు సారథి.

"మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్?"

ఆలోచనల నుండి తేరుకొని తలెత్తి చూశాడు సారథి.

రాజశేఖరం మళ్ళీ అడిగాడు.

"సారథి సార్" ఠక్కున సమాధానం చెప్పాడు సారథి.

"వెరీ ఫైన్....మీదే ఊరు?"

"గుడవల్లేరు సార్."

"ఎంతవరకూ చదువుకున్నారు?"

"ఎం. ఎ. ఫస్ట్ క్లాస్ సార్" ఆ మాట లంటున్నప్పుడు సారథి కళ్ళల్లో గర్వం తొంగి చూచింది.

"అంతేకాదు. యూనివర్శిటీ గోల్డు మెడలిస్ట్ అని కూడా మీ సర్టిఫికేట్స్‌లో వుంది."

"అవును సార్" ఈసారి యింకా గర్వంగా చెప్పాడు సారథి.

"వెరీ గుడ్."

"థాంక్యూ సార్."

అంతే! ఫెళ్ళున నవ్వాడు రాజశేఖరం.

ఆశ్చర్యంగా ఆయన ముఖంలోకి చూశాడు సారథి.

"చూడు మిస్టర్ సారథీ! ఎం. ఎ. లో యూనివర్శిటీ ఫస్టు వచ్చిన వాడివి, ఆఫ్టరాల్ ఈ గుమాస్తా ఉద్యోగానికి ఎందుకు అప్లై చేసినట్లు?" రాజశేఖరం మాటల్లో కొంచెం వ్యంగ్యం ధ్వనించింది.

కొంచెం బాధ కలిగింది సారథికి.

"ఇంతకంటే మంచి ఉద్యోగాలు రాక" అన్నాడు సారథి.

"వాట్!" రాజశేఖరం ఆశ్చర్యంగా సారథి ముఖంలోకి చూశాడు.

"అవును సార్....రికమెండేషన్స్ లేక, లంచాలు యిచ్చుకునే స్తోమతూ లేక, సంవత్సరం నుండి ఎన్ని ఉద్యోగాలకు వెళ్ళినా, ఒక్క ఉద్యోగమూ నన్ను వరించలేదు సార్. అటు వంటప్పుడు ఏదో ఒక ఉద్యోగం చెయ్యాలి గదా!"

సారథిని విచిత్రంగా చూశాడు రాజశేఖరం. ఆయన సర్వీసులో ఎన్నో ఇంటర్‌వ్యూలు చేశాడు. కాని సారథిలాగా నిర్భయంగా మాట్లాడే అభ్యర్థి నెవర్నీ ఇంతవరకూ చూడలేదు. రాజశేఖరానికి అటు యిటూ కూర్చున్న యిద్దరు పెద్దమనుషులూ సారథిని ఆశ్చర్యంగానే చూశారు. ఇంటర్వ్యూకి వచ్చి యింత తెగించి ఎలా మాట్లాడుతున్నాడా అని కాబోలు!

"మిస్టర్ సారధీ! ఇక్కడ ఉద్యోగం రావాలన్నా ఇంతకు ముందు మీరు చెప్పిన రెండింటిలో ఏదో ఒకటి తప్పనిసరిగా కావాలని అడిగితే – అప్పుడు మీరేం చేస్తారు?" రాజశేఖరానికి కుడి వైపున కూర్చున్న ఒక ఇంటర్వ్యూ మెంబరు అడిగాడు.

కొంచెంసేపు ఆలోచనలో పడ్డాడు సారధి.

"ఎంతో గుడ్‌విల్ వున్న మీ కంపెనీలో కూడా యిటువంటి అన్యాయాలు జరుగుతున్నాయని తెలిసినప్పుడు, మీరు పిలిచి ఉద్యోగం యిస్తానన్నా మీలాంటి ఆఫీసర్ల దగ్గర ఉద్యోగం చెయ్యడానికి నేను రెడీగా లేను. సారీ" అన్నాడు సారధి చాలా దృఢంగా.

నిజానికి సారధిలో అంత ధైర్యం రావడానికి కారణం తను అంటెండయిన ఇంటర్‌వ్యూలే! ఎన్నో ఇంటర్‌వ్యూలకి అప్పియరయ్యాడు సారధి. ప్రతిచోటా రికమెండేషన్లూ, మనీ, రాజకీయ నాయకుల ఇన్‌ఫ్లుయన్సూ పని చేశాయేగాని - వర్తి వున్న తనకి ఏ ఉద్యోగమూ రాలేదు. అందుకే సారధి నిర్ణయం చేసుకున్నాడు—ఇక్కడ కూడా తనకు ఎదురుదెబ్బే తగిలింది. ఈ ఉద్యోగం కాకపోతే మరొకటి. తన ప్రయత్నం తను చేస్తాడు.

తనకి ఉద్యోగం రాకపోతే ఆ అవమానం తనది కాదు – తనకి యూనివర్సిటీ ఫస్టు యిచ్చి, గోల్డు మెడల్ బహూకరించిన యూనివర్సిటీ వారిది. తన గొప్పతనాన్ని గుర్తించని యాజమాన్యానిది. తనకే విధమైన ఉద్యోగ రక్షణా కల్పించలేని ప్రభుత్వానిది. ఈ అవమానం వీళ్ళందరికీ వర్తిస్తుంది కాని, తనకు కాదు. తనకి తానే సమాధానపడ్డాడు సారధి.

"ఆల్ రైట్ మిస్టర్ సారధీ! ఇంతకుముందు అనుభవం ఏమైనా వుందా?" రాజశేఖరం అడిగాడు.

"ఉంది సార్ .... ఇంటర్వ్యూలకి వెళ్ళటం నిరాశతో వెనక్కి తిరిగి రావడం...."

"అదికాదు నేను అడిగింది. ..ఎక్స్‌పీరియన్స్."

"ఓ....అదా సార్. అయినా అది ఎలా వస్తుంది సార్. ఎవరైనా ఉద్యోగం యిస్తేనే గదా అనుభవం గడించడానికి. అలాకాక పత్రికల్లో పడే ప్రతి అడ్వర్‌టైజ్‌మెంటుకీ అనుభవం అడిగితే ఎలా సార్?"

"పోనీ - మీరు చదివిన సబ్జక్ట్సు ఈ ఉద్యోగానికి ఏవిధంగానైనా ఉపయోగపడతాయా?"

"పడవని ఖచ్చితంగా చెప్పగలను సార్"

"మరెందుకు అప్లై చేశారు?"

"నా ఉద్దేశంలో ఏవో కొన్ని ఉద్యోగాలను మినహాయిస్తే, తక్కిన ఉద్యోగాలన్నీ, చదివిన చదువులకీ చేస్తున్న ఉద్యోగాలకీ అస్సలు ఏవిధమైన సంబంధం లేదంటాను. ఏ చదువు చదివినా ఆఖరికి ఏదో ఒక ఉద్యోగంలో చేరి కొంతకాలం శ్రమ పడితేనేగాని అనుభవం రాదు. లోతుపాతులూ తెలియవు. డాక్టర్లు కలెక్టర్లుగా చేస్తున్నారు. ఎం. ఎస్సీ. పాసయిన వారు బస్సు కండక్టర్లుగా పని చేస్తున్నారు. బి. ఎ. చదివిన వాళ్ళు కిళ్ళీ బడ్డీలు తెరుచుకొని బ్రతుకు తెరువు చూచుకుంటున్నారు. ఈ ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళందరూ ఇంతకుముందు అనుభవం వుండే చేస్తున్నారా? లేదు. కొంతకాలం ఉద్యోగం చేసిగాని అనుభవాన్ని గడించడం లేదు. నేనూ అంతే. మీరు ఉద్యోగం యిస్తే నేర్చుకుంటాను."

"ఆల్‌రైట్ మిస్టర్ సారధీ! ఇంతకీ ఈ ఉద్యోగం మీ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అవుసరం అంటారా?"

చిన్నగా నవ్వాడు సారధి.

"సారీసర్. అవుసరం లేనిదే ఎం. ఎ. చదివిన వాడు - అందునా యూనివర్సిటీ ఫస్టువచ్చిన వాడు- మెట్రిక్యులేషన్ క్వాలిఫికేషన్‌తో కాల్‌ఫర్ చేసిన ఈ గుమాస్తా ఉద్యోగానికి ఎందుకు వస్తాడు సార్? ఈ చిన్న విషయం నానుంచి రాబట్టాలనే ఉద్దేశంతోనే అడిగారు కాని మీకు తెలియంది కాదు"

"అంటే మీ ఆర్థిక పరిస్థితులు బాగుండలేదా?"

"అవును సార్."

"మీ నాన్నగారు ఏం చేస్తున్నారు?"

"మా నాన్నగారు ఎలా వుంటారో నేను చూడలేదు. నాకు ఊహ తెలియకముందే చనిపోయారని మా అమ్మ చెప్పింది."

"ఐ. సీ....మరి మీకుటుంబ పోషణ ఎలా జరుగుతోంది....ఐ మీన్....నా ఉద్దేశంలో మీకేమైనా ఆస్తిపాస్తులున్నాయా?"

"నో సార్. మా అమ్మకు నేను, నాకు మా అమ్మ....ఇవే సార్ మాకున్న ఆస్తిపాస్తులు. ఇకపోతే ఇంతకాలం ఎలిమెంటరీ స్కూలు టీచరుగా పనిచేసి మా అమ్మ నన్నింత వాడ్ని చేసింది. కాని మా అమ్మకు ఈ మధ్య ఆరోగ్యం బావుండక ఇంటిదగ్గరే వుంటోంది. నేనే ఓ వవారీ షాపులో సాయంత్రం పూట లెక్కలు రాసి ఆ వచ్చిన జీతంతో నేనూ మా అమ్మా బ్రతుకుతున్నాము ఏదో విధంగా" అన్నాడు సారధి.

ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చాడు రాజశేఖరం.

సారధి ముఖానికి పట్టిన చెమటని చేత్తో తుడుచుకున్నాడు.

"ఆల్‌రైట్ .... ఇక మీరు అడగొచ్చు" అంటూ తన ప్రక్కన కూర్చున్న వారి వైపు చూశాడు రాజశేఖరం.

"మిస్టర్ సారధీ! మీ ఒరిజినల్స్ యిలా యివ్వండి" అన్నారు తర్వాత.

సారధి తన చేతిలో భద్రంగా దాచుకొన్న ఫైలు రాజశేఖరానికి అందించాడు.

ఆయన సర్టిఫికెట్స్ వెరిఫై చేస్తున్నాడు.

సారధిని మిగిలిన ఇద్దరు ఇంటర్వ్యూమెంబర్లు ఏవేవో ప్రశ్నలు అడుగుతున్నారు. సారధి తనకు తోచిన విధంగా సమాధానాలు ఇస్తూనే వున్నాడు.

ఓ అయిదు నిముషాలు యిట్టే గడిచిపోయాయి. ఇంటర్‌వ్యూ ముగిసింది.

ఒరిజినల్స్ వెరిఫై చెయ్యడం పూర్తిచేసిన రాజశేఖరం ఫైలు మూసి సారధికి అందించబోయాడు.

కాని—

అదే సమయంలో ఆ ఫైలులోంచి ఓ పాస్‌పోర్టు సైజు ఫొటో గుబుక్కున జారి తక్కున శబ్దం చేస్తూ క్రిందపడిపోయింది.

రాజశేఖరం క్రిందపడిన ఫొటోవైపు దృష్టిని నిలిపాడు.

సారధీ చూశాడు.

"నేను తీస్తానుసార్" అంటూ కూర్చున్న కుర్చీలోంచి లేవబోయాడు సారధి.

"సిడౌన్ మైడియర్ బాయ్ ... నేను తీస్తానులే...." అంటూ క్రిందపడ్డ ఫొటోని తీసి ఒక్కసారి స్థాణువులా అయిపోయాడు రాజశేఖరం. తనతల్లి ఫొటోని చూస్తూనే రాజశేఖరం ఎందుకు అలా అయిపోయాడో సారధికి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

తన తల్లి ఈయనకు తెలుసునా? అయితే ఎలా తెలుసు?

"చూడు మిస్టర్ సారధీ! ఈ ఫొటోలో వున్నావిడ మీకేమవుతారు?" ప్రశ్నించాడు

రాజశేఖరం.

"మా అమ్మ సార్....నాకు ప్రొద్దున లేవగానే మా అమ్మ ముఖం చూసే అలవాటుంది. అందుకే పొరుగూరు వెళ్ళవలసి వచ్చినప్పుడు తప్పనిసరిగా మా అమ్మ ఫోటో వెంట తెచ్చుకుంటూ వుంటాను." ఫొటో తన ఫైలులో వున్నందుకు సంజాయిషీ యిచ్చుకున్నాడు సారధి.

"మీ అమ్మగారి పేరు?"

"శాంతమ్మ సార్."

ఆ పేరు వినడంతోనే రాజశేఖరం ముఖంలో రంగు మారింది. ముఖం చెమటతో తడిసి పోయింది. పైన ఫాను గిరగిరా తిరుగుతూనే వుంది. గదిలోని వాతావరణం చల్లగానే వుంది. కాని రాజశేఖరం చాలా అనీజీగా ఫీలవుతున్నాడు. ఆయనలో సంభవిస్తున్న మార్పుల్ని సారధితో పాటు తక్కిన ఇద్దరు ఎగ్జామినర్సూ అనుమానా స్పదంగానూ, విచిత్రంగానూ గమనిస్తూనే వున్నారు.

ఫోటోని చేత్తో పట్టుకొని తదేకంగా చూస్తున్న రాజశేఖరం ఓ రెండు నిముషాల తర్వాత ఆలోచన నుండి తేరుకొని తనని ప్రక్కన వున్న వాళ్ళు గమనిస్తున్నారని తెలుసుకున్నాడు. ఇంతసేపూ తనెంత అనాలోచితంగా ప్రవర్తించాడో తెలుసుకునే సరికి వొంట్లో సన్నటి వొణుకు ప్రారంభమైంది. అయినా అతి కష్టం మీద తనని తాను నిగ్రహించు కొని చేతిలో వున్న ఫొటోని సారధికి తిరిగి యిచ్చేశాడు.

"వాట్ మిస్టర్ రాజశేఖరం! ఈ కుర్రవాడు మీకు కావాల్సిన వాడా!....ఆ ఫొటోలో వున్నావిడ మీకు తెలుసునా?" అంటూ మిగిలిన ఇద్దరు ఇంటర్వ్యూ మెంబర్లూ ఒకేసారి రాజశేఖరాన్ని అడిగారు.

"నొ....నొ....నాథింగ్..." కంగారు కంగారుగా జవాబు యిచ్చాడు రాజశేఖరం.

సారధి ఎదురుగా వాళ్ళలా అడగటం, అనుమానా స్పదంగా చూడటమూ రాజశేఖరానికి తల తీసేసి నట్లయింది.

అందుకే—

"మిస్టర్ సారధీ! యు కెన్ గో" అన్నాడు రాజశేఖరం.

రాజశేఖరం అందించిన ఫొటోని భద్రంగా ఫైలులో దాచుకొని, లేచి నిలబడి, థాంక్స్ చెప్పు కొని బయటపడ్డాడు సారధి.

గదిలోంచి బయటపడ్డాడన్న మాటేగాని, సారధి ఆలోచనలన్నీ రాజశేఖరం మీదే కేంద్రీకృత మయ్యాయి. రాజశేఖరం ఎందుకలా ప్రవర్తిం చాడు? తన తల్లి ఆయనకు తెలుసునా? ఒకవేళ తెలిస్తే ఏ విధంగా తెలుసును? నో....నో....తన తల్లి ఆయనకు తెలిసి వుండకపోవచ్చును. ఆయనే తనకేమీ తెలీదని కూడా ఇంతకుముందే అన్నాడు. కాకపోతే — తన తల్లిలాంటి పోలికలున్న వ్యక్తితో ఎవరితోనైనా పరిచయం వుండి వుండవచ్చు. అవన్నీ జ్ఞాపకం వచ్చి ఆయన అలా ప్రవర్తించి వుండవచ్చును - అని సరిపెట్టుకున్నాడు సారధి.

కాని - ఎంత సరిపెట్టుకోవాలని ప్రయత్నించినా ఎందుకో సారధి సరిపెట్టుకోలేకపోతున్నాడు. అతని అంతరాత్మ అందుకు వొప్పుకోవడం లేదు. నిజానికి తర్కించి చూచుకుంటే తనకీ ఆ రాజశేఖరానికీ ఏవో దగ్గర పోలికలున్నట్లు అనిపిస్తోంది. చిన్న ప్పుడు ఆయన కూడా తనలాగే స్మార్ట్‌గా అందంగా వుండేవాడేమో! అయినా ఆయన తనలాగా వుండ వలసిన అవకాశం ఏముంది? మనిషిని పోలిన మనిషేనా? లేక....లేక ఛీ! ఛీ! తనెంత మూర్ఖంగా ఆలోచిస్తున్నాడు. తన తండ్రి ఎప్పుడో చనిపోయి నట్లు తన తల్లి చెప్పింది. ఛీ! ఛీ! తన ఆలోచనా ధోరణి ఎంత వక్రంగా నడుస్తోంది. చదువుకున్న వాడయినా, తనెంత నీచంగా ఆలోచిస్తున్నాడు!

తనలో తనే సిగ్గుపడిపోయాడు సారధి.

కాని - ఎంత వద్దనుకున్నా ఏదో అనుమానం తనని పీడిస్తోంది. తనకీ రాజశేఖరానికీ ఏదో అవినా భావ సంబంధం వుండి వుంటుంది. అలా వుండి వుంటే అది ఎటువంటి సంబంధం? తన ప్రశ్నలకు జవాబు దొరకాలంటే తన తల్లిని అడగాలి.... అడిగితే తన తల్లి బాధపడదు గదా!....

ఇంక అక్కడ ఒక్క క్షణం నిలబడలేక పోయాడు సారధి. సరాసరి బస్ స్టాండుకి బయలు దేరాడు.

2

"అమ్మా! నిన్నో విషయం అడుగుతాను. నిజం చెప్తావు కదూ."

ఆ రోజు రాత్రి అన్నం తిని వరండాలో మంచం మీద కూర్చొని వారపత్రిక తిరగేస్తున్న శాంతమ్మ దగ్గరికి వచ్చి నిలబడి భయం భయంగానే అడిగాడు సారధి.

సారధికి తల్లి అంటే భయమూ, భక్తి, గౌరవమూ, ప్రేమా అన్నీ వున్నాయి. అలా అని చనువు కూడా లేకపోలేదు. కొడుకును కొడుకులా కాక కేవలం ఒక మిత్రుడిలా పెంచి పెద్దజేసింది శాంతమ్మ.

అందుకే తల్లిని ఏ విషయం అడగాలన్నా భయపడడు సారధి. కాని - తను అడగబోయే విషయం అతి మామూలు విషయమా? కాదే! అందుకే తటపటాయిస్తూ నిలబడిపోయాడు సారధి.

"అడుగు బాబూ....అడుగు. రా...వచ్చి ఇలా కూర్చో" అంది శాంతమ్మ ఒక ప్రక్కగా జరిగి కొడుక్కి చోటిస్తూ.

తల్లి ప్రక్కనే చోటు చేసుకొని కూర్చున్నాడు సారధి. కాని - అడగదలచుకున్న విషయం ఎలా కదపాలా అని ఆలోచిస్తూ వుండిపోయాడు.



అండమాన్ దీవులలో ఈ మధ్య లాచో అనే పదిహేనేళ్ల యువతి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. అంతటి వేడుకలకి కారణం స్ట్రైయిట్ దీవికి చెందిన లాచో మాత్రమే అండమాన్ ఆదిమ జాతివారిలో మిగిలిన స్త్రీ. ఆ జాతి పునరుద్ధరింపబడా లంటే అది ఆమె మీదనే ఆధారపడి వుంది. ఆమె వివాహం గ్రేట్ అండమాన్‌కి చెందిన గోలట్ అనే పదిహేడేళ్ల యువకుడితో జరిగింది. ఆదిమ వాసులలోని 24 మంది ఆ వివాహ వేడుకలలో పాలుపంచుకున్నారు. గత పదిహేనేళ్ళలో వారి జాతిలో జరిగిన తొలి వివాహం యిదేనట. అందుకే కాబోలు అందరూ ముక్తకంఠంతో 'శీఘ్రమే ఆడ పిల్ల ప్రాప్తిరస్తు' అని దీవించారు!

ఒకవేళ తను అడగబోయే విషయం తన తల్లి మీద ఎలాంటి ప్రభావాన్ని సృష్టిస్తుందో అవగతం కాలేదు. అయినా తన మనసులో చెలరేగుతున్న అనుమానపు తరంగాలని ఎంతకాలం అణచుకోగలడు? అందుకే ధైర్యంచేసి తల్లిని అడగటానికే నిశ్చయించుకున్నాడు. అందులోనూ తనకెలాగూ తల్లి దగ్గర చనువుండనే వుంది.

"ఏమిటి బాబూ! ఆలోచిస్తున్నావ్. అడగదలచుకున్న విషయాన్ని అడగటానికి ఎందుకు సంశయించేదీ? నా దగ్గర కూడా బిడియపడతావేమిట్రా చిట్టి నాయనా" అంది శాంతమ్మ కొడుకు తల నిమురుతూ.

"ఏం లేదమ్మా....ఏం లేదు...." గొణిగాడు సారధి.

కొడుకు అంతగా కంగారు పడుతున్నాడంటే ఏదో బలమైన కారణమే వుండి వుంటుందని ఊహించింది శాంతమ్మ.

కాని - ఆ కారణం ఏదో ఊహించలేకపోయింది.

"ఫర్వాలేదు అడుగు బాబూ! నా దగ్గర భయపడవలసిన అవుసరం నీకెన్నడూ లేదు. నేను నిన్ను ఒక స్నేహితుడిగానే పెంచి- పెద్ద చేశాను గాని - తల్లిగా నీ మీద ఏనాడూ అధికారాన్ని చెలాయించలేదు. ఇంతకాలం నా దగ్గర ఆ చనువు వుందనుకుంటూనే వచ్చాను. ఇప్పుడు నా అంచనాలని తారుమారు చెయ్యొద్దు బాబూ! నిర్భయంగా నీ మనసులోని మాటను బయటపెట్టవచ్చు...." అంది శాంతమ్మ బాధపడుతూ, కొడుక్కి ఒక విధంగా అభయహస్తం యిస్తూ.

"అమ్మా! నాన్న నిజంగా చనిపోయాడా?" తక్కున అడిగాడు సారధి.

నెత్తిమీద పిడుగుపడినట్లుగా తుళ్ళిపడి గుబుక్కున తలెత్తి కొడుకు ముఖంలోకి చూసింది శాంతమ్మ.

సారధి తల దించుకున్నాడు.

శాంతమ్మ ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.

తను ఊహించని ప్రశ్న! పాతిక సంవత్సరాల తర్వాత పీడకలలాంటి గతాన్ని—ఇంతకాలం తన గుండెల్లో కుంపటిలా దాచుకున్న నిజాన్ని—ఇప్పుడు ఇంత అకస్మాత్తుగా తన కొడుకుతో ప్రస్తావించవలసి వస్తుందని అనుకోలేదు శాంతమ్మ.

కాని – ఈ రోజు తనూహించని ప్రశ్న తన కొడుకు అడుగుతున్నాడు. తప్పదు. నిజం చెప్పాలి.

"బాబూ! ఇప్పుడెందుకా అనుమానం వచ్చింది?" కళ్ళలో సుళ్ళు తిరగటానికి సిద్ధమవుతున్న కన్నీళ్ళని అతి కష్టం మీద నిగ్రహించుకుంటూ అడిగింది శాంతమ్మ.

"అమ్మా! ఇంతకాలం నీ బాధని నీ గుండెల్లోనే దాచుకుని, నీలో నువ్వే నరకాన్ని అనుభవించావు. కాని ఇప్పుడు నీ కొడుకు పెద్దవాడయ్యాడమ్మా. బరువు బాధ్యతలు స్వీకరించే వయస్సు వచ్చింది. న్యాయాన్యాయాలు ఆలోచించే లోకజ్ఞానాన్ని సంపాదించాను. నా కోసం ఇన్ని బాధలు అనుభవించిన నువ్వు ఈ రోజు నీ కొడుకు పెద్దవాడైన తర్వాత కూడా నువ్వు ఒక్కదానివే ఎందుకు బాధపడతావమ్మా! నీ బాధలు పంచుకోడానికి నేనున్నాను. చెప్పమ్మా! నీ కష్టసుఖాలు నావి కావా?" ఆవేదనగా అన్నాడు సారధి. అలా అంటున్నప్పుడు అతడి కంఠం రుద్ధమైంది.

ఎప్పుడూ కొడుకు అంత ఆవేశపూరితంగా మాట్లాడటం ఎరుగని శాంతమ్మ ఈ రోజు ఆశ్చర్యచకితురాలైంది. మేను ఆనంద పారవశ్యంతో పులకించింది. పూర్తిగా చలించిపోయింది.

"బాబూ! ఇంతకాలం నా గుండెల్లోనే దాచుకున్న ఈ భయంకరమైన నిజాన్ని ఇంత తొందరగా బహిర్గతం చెయ్యవలసి వస్తుందని నేనూహించలేదు...." శాంతమ్మ గొంతు బొంగురు పోయింది. కళ్ళు చెమర్చాయి.

తల్లి కళ్ళనీళ్ళు చూసి చలించిపోయాడు సారధి.

"అమ్మా! నన్ను క్షమించమ్మా! నిన్ను బాధపెట్టాను" అన్నాడు తప్పు చేసినవాడిలా గిల్టీగా ఫీలవుతూ.

"లేదు బాబూ! లేదు....ఇప్పుడు కాకపోయినా ఎప్పుడో ఒక రోజు నేనే నీకీ రహస్యాన్ని చెప్పాలనుకున్నాను. అయితే యింత అకస్మాత్తుగా నేనీ నిజాన్ని నీ ముందుంచవలసి వస్తుందనుకోలేదు. నా అంతిమ ఘడియల్లో నువ్వు అడిగినా అడక్కపోయినా నీ జన్మ రహస్యాన్ని చెప్పి, నేనింతకాలం అనుభవించిన నరకయాతన అంతం చేసుకోవాలనుకున్నాను .... కాని ఇప్పుడే నీలో అనుమాన బీజం తలెత్తింది. అది అసలు తలెత్తకుండానే వుండాలి. ఇక ఒకసారి తలెత్తిన తర్వాత నీ అనుమానాన్ని నివృత్తి చేయడం తల్లిగా నా కర్తవ్యం....చెప్తాను ...చెప్తాను....

"చిన్నతనంలో—నీకు ఊహ తెలీని రోజుల్లో నువ్వు రోజూ నన్ను అడిగేవాడివి 'నాన్నేడి? నాన్నేడి?'—అని. అప్పుడు నేను నిజం చెప్పినా నువ్వు అర్థం చేసుకోలేని పసి మనసు నీది. నాన్న బ్రతికే వున్నాడని చెబితే, నీ చిన్న మనసు నాన్నను చూడాలని ఆశ పడుతుంది. నీ కోరిక తీర్చలేని అసహాయ స్థితిలో నీతో అబద్ధం చెప్పక తప్పలేదు. అందుకే నాన్న చచ్చిపోయాడనే అబద్ధాన్ని నీతో చెప్పక తప్పలేదు. బాబూ! నిజానికి మీ నాన్న బ్రతికి వున్నాడనే చేదు నిజాన్ని చెప్పి నీ మనసుని బాధ పెట్టడం కంటే, మీ నాన్న చనిపోయాడనే తియ్యటి అబద్ధాన్ని చెప్పి నీకు వూరట కలిగించావలనుకున్నాను. అలా చెప్పడం తప్పయితే నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని తల్లిగా అభ్యర్థిస్తున్నాను....బాబూ! ఇప్పుడు న్యాయాన్యాయాలు ఆలోచించగల వయసుంది నీకు. అందుకే సిగ్గు విడిచి కళంకమైన నా జీవితాన్ని నీ ముందు వుంచుతున్నాను. అర్థం చేసుకుంటావో, అపహాస్యం చేస్తావో అంతా నీ ఆలోచనా విధానానికి వొదిలివేస్తున్నాను. విను బాబూ! నా కథ...." అంటూ తన కథ చెప్పసాగింది శాంతమ్మ.

*

అప్పుడు శాంతి బి. ఎ. చదువుతున్న రోజులు.

విద్యార్థి దశ సామాన్యంగా ప్రతివారికీ మరుపు రానిది. ఆడుతూ పాడుతూ చదువుకునే రోజులు అవి. అటువంటి రోజుల్లోనే శాంతి జీవితం అతి విచిత్రమైన మలుపు తిరిగింది.

శాంతి అందంగా వుంటుంది. అందుకే ఆమెని 'కాలేజి బ్యూటీ' అని పిలుస్తూ వుండేవారు అందరూ. ఎప్పుడూ నవ్వుతూ ఎదుటి వారిని తన మాటలతో నవ్విస్తూ తుళ్ళుతూ పడుతూ అమాయకంగా తిరిగేది శాంతి.

సహజంగా అందంగా వుండే అమ్మాయిల చుట్టూ ప్రదక్షిణలు చెయ్యడమూ, వలలు విసిరి, ఎవరికివారే తమదాన్ని చేసుకోవాలని . ఆరాటపడటమూ విద్యార్థులు చేసే పనే! అయితే అలా విద్యార్థులు వల్లించే ప్రేమ పాఠాలకు దూరంగా, సుదూరంగా వుంటూ వుండేది శాంతి.

కాని – అకస్మాత్తుగా శాంతి జీవితంలోకి ఓ విద్యార్థి అడుగు పెట్టాడు—తలవని తలంపుగా.

అతడి పేరు రాజశేఖరం.

రాజశేఖరం అందంగా వుండేవాడు. ఒక లక్షధి

కారికి ఒక్కడే కొడుకు. ఉత్తమ ఆదర్శాలు, భావాలూ ప్రదర్శిస్తూ వుండేవాడు.

ఒక రోజు అకస్మాత్తుగా – 'నిన్ను నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను' అని శాంతితో అనేశాడు. శాంతి ఆలోచనలో పడింది. ఆ తర్వాత నువ్వు లేకపోతే బ్రతకలేనన్నాడు. నువ్వే నా సర్వస్వం అన్నాడు. నిన్ను ఆరాధిస్తున్నాను అన్నాడు ...ఇంకా ఇంకా చాలా చాలా అన్నాడు. అన్నీ అని ఆఖరున 'నువ్వు నన్ను ప్రేమించకపోతే ఆత్మహత్య చేసుకుంటాను' అన్నాడు.

అన్నీ అమాయకంగా నమ్మేసింది శాంతి.

తనని ప్రేమించి ఆరాధించే మగవాడు దొరకటం కంటే స్త్రీ తన జీవితంలో ఏం కోరుకుంటుంది? కాని-అందుకు తను అర్హురాలు అవునా? కాదా? అని తర్కించుకొంది. ఆఖరుకు తను అందుకు అర్హురాలు కాదని నిర్ధారించుకుంది.

ఆ విషయమే రాజశేఖరంతో చెప్పింది శాంతి.

"చూడు రాజశేఖరం. నువ్వు కలిగిన ఇంటి బిడ్డవు. నేను కటిక దరిద్రురాలిని. నాకంటూ ఆస్తిపాస్తులు ఏమీలేవు-ఒక ముసలితల్లి తప్ప. అందుకే నాలాంటి పేదింటి పిల్లను నీలాంటి పెద్దింటివాళ్ళు ప్రేమించకూడదు. ఒకవేళ ప్రేమించినా ఆ ప్రేమ ఫలించదు. అందుకు ఈ సమాజం ఊరుకోదు. నా మాట విను. ఆ విషయం యిక మరిచిపో. మనిద్దరం మంచి స్నేహితులుగానే వుండిపోదాం".

శాంతి మాటలు విని రాజశేఖరం బిగ్గరగా నవ్వాడు.

"చూడు శాంతీ! ఈ ప్రపంచంలో . ఇద్దరు ప్రేమికులకు ఈ అంతస్తులూ, ఆస్తులూ అడ్డొస్తాయని అనుకుంటే ఈ క్షణంలో అయినా సరే నా ఆస్తి మొత్తాన్ని త్యజించడానికి వెనుకాడను. నీతో వచ్చేస్తాను. మీరు తినే తిండే నేనూ తింటాను. మీరుండే పూరింటిలోనే నేనూ వుంటాను. మీ కష్టసుఖాలలో నేనూ భాగం పంచుకుంటాను. నన్ను నమ్ము. నీ జీవితంతో నేను చెలగాటం ఆడటం లేదు. ఒక పవిత్ర ప్రేమికుడిగా నీ ప్రేమ భిక్షను అర్థిస్తున్నాను" అన్నాడు ఆవేశపూరితంగా రాజశేఖరం.

రాజశేఖరం మాటలు నమ్మింది శాంతి.

శాంతి మనసు ఆనందంతో పరవళ్లు తొక్కింది. ఆ క్షణంలోనే రాజశేఖరాన్ని తన హృదయ ఫలకం మీద ముద్రించుకుంది. బాజాలూ, మెడలో మంగళసూత్రధారణ చేసినట్లుగా అనుభూతి చెందింది శాంతి.

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజుతో బి. ఎ. ఫైనల్ ఇయర్ పరీక్షలు పూర్తయాయి.

ఎవరి ఇండ్లకు వాళ్ళు వెళ్ళిపోవడానికి సన్నద్ధులవుతున్నారు.

ఆ రోజు శాంతీ, రాజశేఖరం ఊరికి దూరంగా పొలాలలోకి షికారుకు బయలుదేరారు. ఆ మరుసటి రోజే శాంతీ రాజశేఖరం విడిపోతున్నారు. కాస్సేపు మాట్లాడుకోవాలనీ, వాళ్ళ భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి ఆలోచించుకోడానికి అలా బయలుదేరారు.

సంధ్య వాలిపోతోంది.

ఊరికి దూరంగా వెళ్ళి ఒక ఇసుక పర్రమీద కూర్చొని మాట్లాడుకుంటున్నారు, ఇద్దరూ.

ఇంతలో అకస్మాత్తుగా వర్షం ప్రారంభమైంది. మొదట మొదట్లో తుంపరగా ప్రారంభమైన వర్షం, రాను రాను భోరున కురవసాగింది.

నిశ్చేష్టులైపోయారు శాంతీ, రాజశేఖరం. తరువాత తల దాచుకొనే తరుణోపాయం కోసం ఆలోచించారు. వారికి కొంచెం దూరంలో ఒక రేకులషెడ్డు కనిపించింది. వెంటనే అక్కడికి చేరుకున్నారు.

ఆ రేకులషెడ్డు ఒక పంపుసెట్ తడిసిపోకుండా తాత్కాలికంగా వేసినది. ప్రస్తుతం అదే వారిద్దరికీ షెల్టర్ యిస్తోంది.

గోడలు లేకపోయినందువల్ల ఈదురగాలికి లోపలికి కూడా జల్లువానపడుతోంది.

వర్షంలో తడిచి ముద్దయిన బట్టలతో శాంతీ-రాజశేఖరం. ఇద్దరూ చలికి గజగజా వణికిపోతున్నారు. ఇద్దరూ వయసులో వున్నవారే. చుట్టుప్రక్కల కన్ను పొడుచుకుచూచినా కనిపించని కారుచీకటి లోకాన్ని ఆక్రమించింది. దూరంగా ఊరి దీపాలు గుడ్డిగా కనబడుతున్నాయి.

లోకజ్ఞానం

1. ప్రపంచంలోకల్లా అతి ప్రాచీనమైన లిపి ఏది?
2. ఐక్యరాజ్యసమితి ప్రథమ సెక్రటరీ – జనరల్ ఎవరో చెప్పగలరా?
3. విలియం కాక్స్టన్ అనే ఆయన దేనిని కనిపెట్టారు?
4. మనం విరివిగా ఉపయోగిస్తున్న నేటి అగ్గిపుల్లల్ని ఎవరు కనిపెట్టారు?
5. జపాన్ అని మన మందరం వ్యవహరిస్తున్న ఆ దేశాన్ని జపాను వారు తమ భాషలో మరో పేరుతో వ్యవహరిస్తారు. ఆ పేరేమిటి?
6. ఇటీవల ఇద్దరు అంతరిక్షయాత్రికులు అంతరిక్షయానంలో నూతన రికార్డు సృష్టించి భూమికి తిరిగి వచ్చారు. వారు ఎవరు? వారు ఎన్ని రోజులపాటు అంతరిక్ష నౌకలో భూప్రదక్షిణాలు చేస్తూ గడిపారు?
7. రవీంద్రనాథటాగూర్‌కి సాహిత్యంలో నోబెల్ బహుమతి వచ్చిందని మీ కందరికీ తెలుసు. అయితే ఏ సంవత్సరంలో ఆయనకా బహుమతి లభించింది? దేనికి లభించింది?
8. ఒక చేప వుంది. ఆ చేప పసిఫిక్ మహాసముద్రం దాకా ప్రయాణం చేసి గానీ గ్రుడ్లు పెట్టదు. ఆ చేప ఏదో చెప్పగలరా?
9. బ్రిటిష్‌వారి రాజరికం భారతదేశంలో ఎప్పుడు ప్రారంభమైంది?
10 మన దేశంలో ఒక వ్యక్తి రెండుసార్లు తాత్కాలిక ప్రధానిగా నియమితులైనారు ఆయన ఎవరు? మొత్తం ఎన్ని రోజులు ఆయన ఆ పదవిలో వున్నారు?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి].

ఇంతలో ఉన్నట్లుండి దిక్కులు పిక్కటిల్లే లాగున ఒక భయంకరమైన ఉరుము వురిమింది. ఆ వెంటనే తళతళమంటూ మెరుపు మెరిసింది.

ఈ హఠాత్ పరిణామానికి భయకంపితురాలైంది శాంతి. భయంతో గుబుక్కున దగ్గరలో వున్న రాజశేఖరాన్ని కౌగలించుకుంది.

బయట వర్షం....ఈదురగాలి....చలి....చీకటి.. తడిసిన బట్టలతో...దగ్గరగా .... అతి దగ్గరగా.... ఒకరి కౌగలిలో వొకరు .... ఒకరి ఉఛ్వాస నిశ్వాసాలు మరొకరికి తగులుతున్నాయి - వేడిగా, మత్త మత్తుగా....వయసులోని బింకంలో వున్న ఆమె ఎత్తుపల్లాలు మెత్తగా .... మృదువుగా....అతని గుండెలకు తగులుతున్నాయి. ఏదో తెలియని అనుభూతి .... స్వర్గ ద్వారాలు తెరుచుకుంటున్న దివ్యానుభూతి....

భరించలేకపోయాడు రాజశేఖరం.

వేడిగా....ఒళ్ళు...రక్తం...మరిగిపోతున్నట్లుగా వుంది...మనసు మొద్దుబారిపోయింది...పాపమూ... పుణ్యమూ....న్యాయమూ.... అన్యాయమూ........ సంఘము....పాపభీతి....అవేమీ గుర్తు రాలేదు రాజశేఖరానికి. అటువంటి ఉన్మాదస్థితిలో అటువంటి వేమీ అసలు గుర్తురావేమో!

అందుకే తన కౌగిట్లో వున్న శాంతిని యింకా... యింకా దగ్గరికి తీసుకొని....గుండెలకు యింకా బలంగా హత్తుకొని, ఆమె ముఖాన్ని తన ముఖానికి చేర్చుకొని ఆమె పెదవులు తన పెదవులతో....

ఏమి జరుగుతుందో....ఏమి జరగ్గూడదో.... తెలుసుకునేసరికే జరగవలసిన ఘోరమేదో జరిగిపోయింది.

గొల్లుమంది శాంతి.

వొంట్లోని వేడి చల్లారిన తర్వాత ఆలోచించాడు రాజశేఖరం. ఛీ! ఛీ! తనెంత మూర్ఖంగా ప్రవర్తించాడు. ఇప్పుడు శాంతి తనని గురించి ఎంత నీచంగా ఆలోచిస్తుందోగదా. పెళ్ళి కాక ముందే ఆమె శీలాన్ని అపహరించిన తను నిజంగా క్షమార్హుడుకాడు. హే భగవాన్. ఎంత ఘోరం జరిగిపోయింది. అనాలోచితంగా తప్పు జరిగిపోయింది. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే....ఇప్పుడేమిటి కర్తవ్యం? శాంతిని ఎలా ఓదార్చగలడు? ఏమని ఓదార్చగ్గలడు?

అంతలోనే ఏదో తృప్తి. తనేం అన్యాయం చెయ్యడం లేదు శాంతికి. పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాడు. కాకపోతే పెళ్ళయిన తర్వాత మొదటి రాత్రి అనుభవించాల్సిన సుఖాన్ని ఇప్పుడే దోచుకున్నాడు తను. అంతే! అంతే!

"శాంతీ! తప్పు చేశాను. క్షమించమని అడిగే అర్హత తను కోల్పోయాను. కాని - నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. పెళ్ళయిన తర్వాత ప్రతి యువతీ యువకుడూ కలలుకనే మొదటి రాత్రిని దూరం చేసుకున్నాము. అంతకంటే మరేమీ జరగలేదు. ఇప్పుడే పంచభూతాలు సాక్షిగా నిన్ను నా అర్ధాంగిని చేసుకుంటున్నాను. ఇంటికి వెళ్ళగానే ఇంట్లోవాళ్ళకి నచ్చచెప్పి-సంఘం కోసం పదిమంది ఎదుట, పెద్ద పందిరి క్రింద, బాజా భజంత్రీలతో వివాహం చేసుకుందాం. సరేనా. నా మాట నమ్ము" అంటూ తన చేతికి వున్న వజ్రపు టుంగరాన్ని తీసి శాంతి వేలికి తొడిగాడు రాజశేఖరం.

శాంతి మాట్లాడలేదు.

జరిగినదానిని నెమరు వేసుకుంటూ, జరగబోయే దాన్ని ఊహించుకుంటూ, ముందేదో వెలుగు కనిపిస్తుందని వెర్రిగా నమ్మవలసిందే కాని, విధికి ఎదురీద లేదు గదా! పొరపాటువల్లో, లేక తన గ్రహపాటువల్లో, స్త్రీ జీవితంలో ఏది జరగ్గూడదో అది జరిగిపోయింది. తనేమీ చెయ్యలేని అశక్తురాలు. ఇక అటువంటప్పుడు రాజశేఖరం మాటలు నమ్మక ఏం చేస్తుంది? నమ్మకపోయి ఏం చెయ్యగలదు గనుక?!

ఆ మరుసటిరోజే శాంతి దగ్గర వీడ్కోలు పుచ్చుకొని, ఎంతో బాధపడుతూ, వెళ్ళలేక వెళ్ళిపోయాడు రాజశేఖరం.

రాజశేఖరం వెళ్లిన దగ్గరినుంచీ, అతడి దగ్గర నుంచి సుముఖంగా ఉత్తరం వస్తుందని ఆశతో ఎదురుచూస్తూనే వుంది శాంతి.

కాని రాజశేఖరం నుండి ఎటువంటి ఉత్తరమూ రాలేదు. తనే రెండు ఉత్తరాలు రాసింది కూడా. కాని వాటికి కూడా అతని దగ్గరనుండి జవాబు లేదు.

ఏవో పనుల ఒత్తిడివల్ల గానీ, తల్లిదండ్రులను ఒప్పించడంలో జాప్యం జరగటం వల్ల గానీ, మరేదో కారణం వల్లగానీ అతడు తన ఉత్తరాలకు సకాలంలో జవాబు రాయలేకపోయాడేమోనని కొంతకాలం తనకి తానే సమాధానం చెప్పుకుంది.

కాని ఎంతకాలమని తనకి తాను సమాధానం చెప్పుకోగలదు?

రెండునెలలు రెండు యుగాల్లా గడిచిపోయాయి.

రాజశేఖరం దగ్గరి నుండి ఉత్తరాలు రాక, విషయం బోధపడక ఒక ప్రక్కన సతమతమవుతున్న తరుణంలో, మరో భయంకరమైన నిజం బయటపడింది.

తను నెల తప్పింది!!

ఎంత భయంకరమైన నిజం అది!

ఈ నిజాన్ని తన తల్లితో చెప్పుకోగలదా? ఇంకెవరితోనైనా చెప్పుకోగలదా? చెప్పుకున్నా ఎవరు అర్థం చేసుకుంటారు? కళ్ళు కానని కామంలో కాలు జారిందని తనని అసహ్యించు కుంటారేగాని, సానుభూతి ఎవరు మాత్రం ఎందుకు చూపిస్తారు?

భవిష్యత్తు అగమ్యగోచరంలా తోచింది శాంతికి.

ఈ నిజాన్ని చెప్పుకోడానికి రాజశేఖరం ఒక్కడే అర్హుడు. అతడే తనని అర్థం చేసుకోగలడు. అతడితోనే చెప్పుకోవాలి. అంతే! అంతే!

అందుకే - తన తల్లికి ఏదో కుంటిసాకు చెప్పి, రాజశేఖరం దగ్గరికి బయలుదేరింది.

రైలు దిగిం తర్వాత రాజశేఖరం వాళ్ళ ఇల్లు తెలుసుకోవడం ఏమంత కష్టమనిపించలేదు శాంతికి.

రాజశేఖరం వాళ్ళ నాన్నగారికి ఆ ఊళ్ళోనే గాక, ఆ చుట్టుప్రక్కల కూడా చాల పలుకుబడి వుంది. ఆస్తిపాస్తులున్నాయి. అంతస్తు వుంది.

పెద్ద బంగళా....బంగళా చుట్టూ విశాలమైన ప్రహరీ...ప్రహరీ లోపల చక్కని పూలమొక్కలూ ఆ మొక్కలకి అందమైన రకరకాల పూలూ.... ఇంటి ముందు పోర్టికోలో అందమైన కారు.... ఇంట్లో అటూ యిటూ తిరిగే ఆరోగ్యమైన అల్సేషియన్ కుక్కా....

ఇంటి ముందు నిలబడి దిక్కులు చూస్తున్న శాంతిని గేటుదగ్గర నిలబడి వున్న వాచ్‌మన్ అడిగాడు—

"ఎవరు కావాలమ్మా, తమకి?"

ఒక్కక్షణం అతడి ముఖంలోకి చూసి శాంతి అంది—

"రాజశేఖరంగారు."

"చినబాబుగారా? వున్నారమ్మా. లోపలికి వెళ్ళండి" అన్నాడు గేటు తీస్తూ వాచ్‌మన్.

లోపలికి వెళ్ళటానికి సంశయించింది శాంతి.

"వెళ్ళండమ్మా" మరోసారి అన్నాడు వాచ్‌మన్, తను వెళ్ళమని గేటు తెరచినా ఆమె ఎందుకు వెళ్ళలేదో అర్థంకాక.

"లోపల కుక్క...." బిక్కు బిక్కుమంటూ సమాధానం యిచ్చింది శాంతి.

అప్పుడుగాని అర్థంకాలేదు వాచ్‌మన్‌కి. అయినా ఆ సంగతి తన మట్టిబుర్రకు తట్టనేలేదు. అదేం మామూలు వీధి కుక్కా ? ఏమన్నానా ? పెద్ద అయ్యగారు రెండు వేల రూపాయలుపెట్టి బెంగళూరు నుంచి కొనుక్కొచ్చిన మేలుజాతి అల్సేషియన్ కుక్కాయె ! పొరపాటున లోపలికి ప్రవేశించిన ఏ అపరిచిత వ్యక్తినీ అది మామూలుగా వొదిలి పెట్టదు. రక్తం కళ్ళజూచిగాని మరీ వొదిలిపెట్టదు ఆ కుక్క. అటువంటిది పాపం ఈ అమ్మాయి అనాలోచితంగా లోపలికి వెళ్ళినట్లయితే ఎంత ప్రమాదం జరిగి వుండేదో గదా....తనలో తనే సిగ్గుపడ్డాడు వాచ్‌మన్.

"ఓ అదా....వుండు నేను లోపలికి వచ్చి దిగ విడుస్తాను.'' అని గేటు మూసి, లోపలికి దారితీశాడు వాచ్‌మన్.

శాంతి అనుసరించింది అతన్ని.

కాని - శాంతి ఊహ తారుమారు కాలేదు. అటూ ఇటూ తిరుగుతోన్న అల్సేషియన్, తనని చూడగానే భయంకరంగా అరుచుకుంటూ తన వైపు రాసాగింది.

"క్యాండీ....క్యాండీ స్టాప్....స్టాప్'' అంటూ శాంతికి ముందు నడుస్తున్న వాచ్‌మన్ ఆ కుక్కని పట్టుకొని తల నిమురుతూ, శాంతితో "మీరు లోపలికి వెళ్ళి, అదిగో ఆ కుడిచేతివైపున వున్న విజిటర్స్ రూంలో కూర్చోండి. నేవెళ్ళి అయ్య గారితో చెప్పి వస్తాను'' అని, కుక్కతో, "క్యాండీ, గో....'' అంటూ మెట్లవైపు దారితీస్తున్న వాడల్లా ఠక్కున ఆగి, మళ్ళీ శాంతి దగ్గరికి వచ్చి "ఇంతకీ ఎవరు వచ్చారని చెప్పమంటారమ్మా చినబాబు గారితో'' అన్నాడు.

"శాంతి వచ్చిందని చెప్పండి.''

వాచ్‌మన్ మేడమీదికి వెళ్లిపోయాడు.

విజిటర్స్ రూంలో శాంతి ఒక్కతే బిక్కు బిక్కుమంటూ కూర్చొనుంది. రాజశేఖరం ఎప్పుడు వస్తాడా ? అని క్షణాలు లెక్కబెడుతోంది.

ఓ పదినిముషాలు భారంగా గడిచాయి.

వస్తాడనుకున్న తన ప్రియుడు రాజశేఖరం రాలేదు.

కాని - పిలుసుకొస్తానని వెళ్ళిన వాచ్‌మన్ తిరిగొచ్చాడు.

ఆశగా అతడి ముఖంలోకి చూచింది శాంతి.

"పెద్ద అయ్యగారు మిమ్మల్ని తీసుకు రమ్మంటున్నారమ్మా'' అని చెప్పాడు వాచ్‌మన్.

గుండెల్లో రాయిపడింది శాంతికి.

పెద్దయ్యగారా ? అంటే....రాజశేఖరం తండ్రి గారా? ఆయనగారు తనని ఎందుకు రమ్మంటున్నట్లు? ఏం మాట్లాడుతారు ? అయినా - ఇంతకీ రాజ శేఖరం ఏమయినట్లు ? ఎన్నో ఆలోచనలు శాంతిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే అనాలోచితంగా లేచి నిలబడింది.

"ఇంతకీ... రాజశేఖరం లేరా ?'' అడిగింది శాంతి.

"ఉన్నారమ్మా .... లోపల ఆయన గదిలో వున్నారు. చినబాబుగారితో మీరు వచ్చిన విషయం చెప్పాలనే ఆయన గదివైపు వెళుతుంటే పెద్ద అయ్యగారు పిలిచి విషయం అడిగారు. మీరు వచ్చినట్లు చెప్పాను. 'చినబాబుతో చెప్పాల్సిన పని లేదు. ఆ అమ్మాయిని నా దగ్గరకే తీసుకు రా' - అన్నారండి. అందుకే మిమ్మల్ని పెద్దయ్యగారి దగ్గరికి తీసుకెళుతున్నాను'' అన్నాడు వాచ్‌మన్ అమాయకంగా ముఖం పెట్టి.

ఈసారి శాంతి గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

అంటే....అంటే రాజశేఖరానికి వాళ్ళ నాన్న గారికీ ఏదో గొడవలు జరిగాయన్నమాట. అయితే... తన గతేం కావాలి ?....

పూజా పుష్పము

దేవుని పాదముల వెలిగేటి పువ్వా
శంకరుని శిరమున, మెరిసేటి పువ్వా
శ్రీ హరి ఉరమున హారమే పువ్వా
పొద్దుకే మా తల్లి పూజకో పువ్వా

మొగ్గగా మోజులతొ మురిపించు పువ్వా
వన్నె వన్నెల సొగసు వికసించు పువ్వా
పూల బాలల జడల విరిసేటి పువ్వా
పొద్దుకే మా తల్లి పూజకో పువ్వా

చిగురాకు మరుగున సొగసారు పువ్వా
ముత్తైదు సిగలోన చెలువారు పువ్వా
మహాలక్ష్మి హస్తమున రాజిల్లు పువ్వా
పొద్దుకే మా తల్లి పూజకో పువ్వా

దివ్య పరిమళము వెదజల్లు పువ్వా
మకరంద మాధుర్య మొలికించు పువ్వా
మంగళ కరమై శోభిల్లు పువ్వా
పొద్దుకే మా తల్లి పూజకో పువ్వా

—తిమ్మరాజు హైమావతి

"రండమ్మా ! అయ్యగారి గది చూపిస్తాను'' మరోసారి హెచ్చరించాడు వాచ్‌మన్, మెట్లమీదికి దారి తీస్తూ.

ఆలోచనలనుండి తేరుకొని అతన్ని అనుస రించింది శాంతి. ఇంక ఆ పరిస్థితుల్లో అంతకంటే గత్యంతరం లేదు తనకి. ప్రస్తుతం పులిబోనులో అడుగు పెట్టిన చందంలా వుంది తన పరిస్థితి. ఇంతదూరం వచ్చి కూడా తన బ్రతుక్కోమార్గం కల్పించుకోలేకపోతే ఎలా ?

"ఇదేనమ్మా ! పెద్దయ్యగారి గది. లోపలికి వెళ్ళు.'' అంటూ ఒక గదిముందు ఆగి చూపించాడు వాచ్‌మన్.

వాచ్‌మన్‌కి థాంక్స్ చెప్పుకొని, భయం భయంగానే ఆ గదిలో అడుగుపెట్టింది శాంతి.

అది విశాలమైన గది....క్రింద కాశ్మీర్ కార్పెట్ పరచి వుంది. గది నిండుగా ఖరీదైన ఫర్నిచర్ వుంది. గుమ్మాలకీ, గది కిటికీలకి సిల్కు స్క్రీన్స్ వ్రేలాడుతున్నాయి.

లోపల ఎవరూలేరు.

ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయింది శాంతి రెండు నిముషాలు.

"కూర్చోండి''

ఎవరో తననే ఉద్దేశించి అన్నట్లై తలత్రిప్పి చూచింది శాంతి.

ఓ అపరిచిత వ్యక్తి అప్పుడే డోర్ కర్టెన్ తొలగించుకొని ప్రక్కగదిలోంచి వస్తున్నాడు.

శాంతి కూర్చోలేదు.

ఆ అపరిచిత వ్యక్తిని చూస్తూ వుండిపోయింది.

ఆరడుగుల ఆజానుబాహుండు....ఎత్తుకు తగ్గ లావు ... మిగల పండిన జామపండు లాంటి శరీర ఛాయ....బట్టతల....గోల్డుఫ్రేమ్ కళ్ళద్దాలు.... తెల్లని మీసాలు....సిల్కులాల్చీ....గ్లాస్కోపంచె.

"కూర్చోండి'' మరోసారి గుర్తు చేశాడు ఆ వ్యక్తి.

తడబడి, అచేతనంగా సోఫాలో కూలబడింది శాంతి.

రెండు నిముషాలు నిశ్శబ్దం తర్వాత.

"మీ పేరు శాంతి కదూ....'' ఆ వ్యక్తి ప్రశ్నించాడు.

727

బౌనన్నట్లు తలూపింది తలొంచుకునే.

"నా పేరు ప్రసాదరావు. రాజశేఖరం తండ్రిని" తనని తాను పరిచయం చేసుకున్నాడు.

నమస్కారం చేసింది శాంతి, లేచి నిలబడింది.

"కూర్చోండి....కూర్చోండి"

శాంతి మళ్ళీ కూర్చుంది. కాని ప్రసాదరావు గారు కూర్చోలేదు. గదిలో అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు.

"చూడమ్మా శాంతీ! నీ గురించి రాజశేఖరం అన్ని విషయాలూ నాతో చెప్పాడు" ప్రసాదరావు గారు నెమ్మదిగా అన్నారు, తను చెప్పబోయే విషయానికి నాందిలా.

తను కదిలించాలనుకున్న విషయాన్ని ప్రసాదరావుగారే కదిలించగానే, ఒక విధంగా పెద్ద బరువు నెత్తిమీది నుండి దిగిపోయినట్లు ఫీలయ్యింది శాంతి. కాని ఎన్నో ఆలోచనలు తనని చుట్టుముట్టాయి. రాజశేఖరం ఈయనతో ఏమని చెప్పాడు? తమ పెళ్ళి విషయం చెప్పివుంటాడా? తమ పెళ్ళి చెయ్యడానికి అసలు ఈయన సుముఖంగా వున్నారా?

"చూడమ్మా శాంతీ! ఒకసారి ఆ కుడిచేతి వైపు గోడమీదికి చూడు" ప్రసాదరావుగారి మాటలకు ఆలోచనల నుండి తేరుకొని, తలెత్తి గోడమీదికి దృష్టిని మరల్చింది.

అక్కడ గోడ మీద తగిలించి వున్న రెండు లైఫ్ సైజు ఫొటోలు....

రెండు ఫొటోలు యించుమించుగా ఒకలాగే వున్నాయి. రెండూ ప్రక్క ప్రక్కగా తగిలించి వున్నాయి. జమిందారుల్లాంటి వేషాల్లో అజానుబాహువుల్లాంటి ఇద్దరూ రెండు ఫొటోల్లోనూ వున్నారు. తలపాగా, గుబురుగా పెరిగి మెలితిరిగిన మీసాలూ మెడలో పులిగోరూ, పొన్ను కర్ర చేతిలో, నెక్ కోటూ, కాళ్ళకి అంటిపెట్టుకొన్నట్లు వున్న సురవా, కాళ్ళకి వొంకితిరిగిన చెప్పులూ.

"ఆ మొదటి ఫొటోలో వున్నాయన మా తాతగారు, ఒకప్పుడు ఈ పరగణాకి తిరుగులేని జమిందారు. ఆ ప్రక్క ఫొటోలో వున్నాయన మా తండ్రిగారు, ఆయినా జమిందారే. వారిద్దరూ ఎలా బ్రతికారో నేను వేరే చెప్పనవసరం లేదు. వాళ్ళ వేషాలు చూస్తే నువ్వే గ్రహించి వుంటావు. ఇకపోతే వారిద్దరి తర్వాత వారి వారసుడ్ని నేను. వాళ్ళు వొదిలిపోయిన వంశ గౌరవాన్నీ, ప్రతిష్ఠనూ కాపాడవలసిన బాధ్యత నా మీద వుంది. ఇప్పుడు నాకు జమీ లేకపోయినా పదితరాలు కాలుమీద కాలేసుకొని తిన్నా తరగని ఆస్తిపాస్తులున్నాయి. ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందో నువ్వీసరికి గ్రహించే వుంటావు. నాకు ఏకైక వారసుడు రాజశేఖరం. వాడు నా పరువు ప్రతిష్ఠలను వంశ గౌరవాన్నీ కాపాడతాడని కలలు గన్నాను. కాని నా ఆశలు తారుమారయ్యాయి...." అర్థోక్తిగా మధ్యలోనే తను చెప్పడం ఆపారు ప్రసాదరావుగారు.

"అంటే .... అంటే .... మీ ఉద్దేశం ...." హతాశురాలై అడిగింది శాంతి.

"ఇంకా అర్థం కాలేదా శాంతీ! మాది వంశ ప్రతిష్ఠలకు ప్రాణం పెట్టే వంశం. ఈ ఇంటికి కోడలుగా రావడానికి కొన్ని అర్హతలుండాలి. ఆస్తి అంతస్తు పరువు ప్రతిష్ఠలు గల వంశమై వుండాలి."

"అంటే, మీ ఉద్దేశం ప్రకారం మీ ఇంటి కోడలు మానాభిమానాలు లేనిదైనా పర్వాలేదన్న మాట. ఒక కన్నె పిల్ల జీవితంతో ఆటలాడి ఆమె మానాన్ని అపహరించి ఆ తర్వాత మట్టి బొమ్మలా పగులగొట్టడం మీ వంశానికి పరువూ ప్రతిష్ఠలను ఎక్కువగా తెచ్చిపెడుతుందన్న మాట." ఆవేశంగా అనేసింది శాంతి.

ప్రసాదరావుగారు ఆమె మాటలకు గతుక్కుమన్నారు. కాని వెంటనే తమాయించుకున్నారు కూడా.

"చూడమ్మా శాంతీ! నిదానించి నేను చెప్పేది పూర్తిగా విను. ఆవేశం తెచ్చుకున్నా ప్రయోజనం లేదని ఈసరికే గ్రహించి వుంటావు. మా రాజశేఖరం నిన్ను పెళ్ళి చేసుకుంటానని మాట యిచ్చి వుంటాడు. నేను కాదనను, కాని - తెలిసీ తెలియని వయస్సులో పిల్లలు తప్పటడుగులు వెయ్యడం సహజం. అయితే పిల్లలు వేసిన ప్రతి తప్పటడుగూ సరిఅయినదే అని పిల్లల్ని సమర్థించడం పెద్దల అవివేకం. రాజశేఖరం నీకు మాట ఇచ్చినా వాడి సంరక్షకుడిగా ఈ వంశ గౌరవాన్ని నిలబెట్టవలసిన బాధ్యతాయుతమైన మనిషిగా వాడి యోగక్షేమాలు ఆలోచించాల్సిన తండ్రిని నేనింకా బ్రతికే వున్నాను. నేను బ్రతికి వుండగా ఈ ఇంట్లో ఏది జరిగినా నా ఇష్టప్రకారమే జరిగి తీరాలి. అలా జరక్కపోతే, నా మాటను ఎదిరించిన ప్రతివాడినీ పిట్టని కాల్చేసినట్లు తుపాకీతో కాల్చేస్తాను" అన్నాడు ప్రసాదరావుగారు.

శాంతికి ప్రసాదరావుగారి ఆలోచనా విధానం బోధపడింది. మెత్తగా ఎదుటివారికి కష్టం కలిగించకుండా మాట్లాడి తన కార్యాన్ని సాధించుకోగల సమర్థుడు ఆయన. లేకపోతే ప్రాణాలు తీసి అయినా సరే తన పంతాన్ని నెగ్గించుకోగల కఠినాత్ముడు అని అర్థం చేసుకోగలిగింది శాంతి.

"చూడండి ప్రసాదరావుగారూ! ఒకవేళ మీ అబ్బాయి మీ మాట వినకపోతే" శాంతి అడిగింది శాంతంగా.

పెద్దగా హాలు ప్రతిధ్వనించేలా నవ్వారు ప్రసాదరావుగారు.

"వినకపోవడమా! అది కలలో మాట .... నా పేరు చెప్పితే ఈ ఇంట్లో చీమ కూడా ఆహారం ముట్టదు తెలిసిందా?" అతి గర్వంగా అన్నారాయన.

"పోనీ మాటవరసకే అనుకుందాం. మీ అబ్బాయి మీ మాట వినకపోతే" రెట్టించి అడిగింది శాంతి.

"ముందే చెప్పాను. పిట్టని కాల్చేసినట్లు కాల్చేస్తానని. ఒకవేళ నా కంటబడకుండా ఏ మారుమూలలకో పారిపోయినా, నా ఆస్తిలో చిల్లికానీ కూడా వాడికి చెందదు. ఏ అనాథశరణాలయానికో నా ఆస్తినంతా రాసేస్తాను."

"అంత ఉదార స్వభావం వున్నవాళ్ళే అయితే మీరు ఒక పేదింటి పిల్లని చేసుకోడానికి అభ్యంతరం చెప్పరు ..." అంది హేళనగా శాంతి.

"చూడమ్మా శాంతీ! గతాన్ని గురించి ఇప్పుడు ఆలోచనలు అనవసరం. ఇప్పుడు మా రాజశేఖరానికి పెళ్ళి నిశ్చయమైంది. మరో పది రోజుల్లో పెళ్ళి కూడా జరుగుతుంది. పిల్ల తండ్రికి పది కంపెనీల్లో షేర్లున్నాయి. ఒక్కతే కూతురు. తరగని ఆస్తి వుంది" అన్నారు ప్రసాదరావుగారు గర్వంగా.

మరో పిడుగు నెత్తిమీద పడినట్లు తుళ్ళిపడింది శాంతి.

అయిపోయింది. అంతా అయిపోయింది. ఇంత దూరం ఎంతో ఆశతో వచ్చిన తనకు తిరుగులేని ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పుడు తనేం చెయ్యాలి? తనకేది దారి? తన కడుపులో రూపం దిద్దుకుంటున్న మరో ప్రాణిని ఏం చెయ్యాలి? హే భగవాన్! ఎంత క్రూరంగా నా విధి రాత రాశావయ్యా!

మరో అయిదు నిముషాలవరకూ శాంతి మాట్లాడలేకపోయింది.

" ఈ పెళ్ళికి రాజశేఖరం అంగీకరించాడా ? " అడిగింది శాంతి. తనకి అన్యాయం ఎవరు చేశారో తెలుసుకోవాలనే ఉద్దేశంతో.

" నీ కెందుకొచ్చిందా అనుమానం శాంతీ ! "

"రాజశేఖరం ఇంత మోసగాడని ఇంకా ఎందుకో నా అంతరాత్మ నమ్మడం లేదు."

"మోసం అని అనుకోడానికి ఇందులో అస్కారమేలేదు. వాడు పసివాడు. వాడికో నిశ్చితమైన అభిప్రాయాలు వుంటాయని నువ్వు అనుకోడం అది నీ పొరపాటు. ఆల్‌రైట్ .... జరిగిందేదో జరిగిపోయింది. ఇక రాజశేఖరాన్ని గురించి మరిచిపో...." చాలా కచ్చితంగా చెప్పారు ప్రసాదరావుగారు.

ఇప్పుడు శాంతి మనసు చాలా ప్రశాంతంగా వుంది.

రాజశేఖరం పిరికివాడనీ, వ్యక్తిత్వం లేని మనిషనీ, ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని అసమర్థుడనీ తనకు మొదట్లో తెలీదు. ఇప్పుడే తెలుసుకోగలిగింది. ఇప్పుడిక తనకి రాజశేఖరాన్ని గురించిన దిగులు లేదు. అటువంటి వాడిని చేసుకున్నా తను జీవితంలో అతనితో రాజీపడలేదు.

"చూడండి ప్రసాదరావుగారూ ! ఎన్నో ఆశలతో ఇంతదూరం వచ్చాను. రాజశేఖరాన్ని కలుసుకోవాలనీ, అతడు చేసిన వాగ్దానాలు ఇంకా జ్ఞాపకముంచుకుంటాడనీ ఆశపడ్డాను. కాని ఇక్కడికి వచ్చిన తర్వాత అసలు నిజం తెలుసుకున్నాను.... ఇప్పుడు నాకేం కోరికలూ లేవు. ఏ ఆశలూ లేవు. కాని ఒక మాట మాత్రం రాజశేఖరానికి చెప్పండి" అంది శాంతి.

" చెప్పమ్మా "

" మీ అబ్బాయి ప్రతిరూపం నా కడుపులో ప్రాణం పోసుకుంటోంది."

" ఏమిటీ ! నువ్విప్పుడు గర్భవతివా ? " ఉండేలు దెబ్బతిన్నవాడిలా అదిరిపడ్డారు ప్రసాదరావుగారు.

" అవునండీ ! కాని....అంతమాత్రంచేత పిరికిదానిలా ప్రాణాలు మాత్రం తీసుకోను " శాంతి కంఠంలో దృఢసంకల్పం ధ్వనించింది.

" వెరీ గుడ్....అలా వుండాలి....చూడమ్మా శాంతీ ! తప్పు ప్రతి మనిషీ చేస్తాడు. అయితే తప్పు చేసిన ప్రతి మనిషీ ప్రాణాలు తీసుకోవడం అనేది అవివేకం. మనసుని దృఢపరచుకొని, గతాన్ని మరచిపోయి, మరో మార్గం చూసుకొని జీవితంలో సుఖపడు "

శాంతి మాట్లాడలేదు.

లేచి నిలబడింది.

" కూర్చోమ్మా ! ఇప్పుడే వస్తాను " అని లోపలికి వెళ్ళారు ప్రసాదరావుగారు. రెండు నిముషాల తర్వాత చేతిలో నోట్ల కట్టలు పట్టుకొని తిరిగి వచ్చారు.

" చూడమ్మా ! శాంతీ ! ఇదిగో ఈ డబ్బు తీసుకో "

ఒక్క-క్షణం కొయ్యబారిపోయింది శాంతి.

" ప్రసాదరావుగారూ ! ఇప్పటివరకూ మీరు ఎలా మాట్లాడినా పెద్దవారనే గౌరవభావం వుంది. కాని ఒక ఆడదాని శీలాన్ని డబ్బుతో విలువకట్టిన మీ నీచ భావానికి మిమ్మల్ని యిప్పుడు అసహ్యించుకుంటున్నాను " ప్రసాదరావుగారిని ఒక పురుగుని చూచినట్లు చూస్తూ అంది శాంతి.

తడబడ్డారు ఆయన.

" అందుకు కాదమ్మా ! నువ్వు పేదింటి పిల్లవి. ఈ పరిస్థితుల్లో నీ కడుపులో పెరుగుతున్న పిండాన్ని రూపుమాపు చేసుకోడానికి ఏదైనా డాక్టర్ని సంప్రదించక తప్పదు గదా. అందుకోసమైనా ఈ డబ్బు అవుసరం నీకుంటుంది. ఉంచుకో."

కొత్త వస్తువులు

ఒవెన్–టోస్టర్–గ్రిల్

ట్రేడింగ్ ఇంజనీర్స్ (ఢిల్లీ) వారు ఎలక్ట్రిక్ ఒవెన్–టోస్టర్–గ్రిల్ అన్న పరికరాన్ని ఉత్పత్తి చేశారు. " లైఫ్ లాంగ్ ఒవెన్–టోస్టర్–గ్రిల్ (ఒటిజి 1000)" అని దానికి పేరు పెట్టారు. ఇలాంటి పరికరం భారత దేశంలో ఉత్పత్తికావడం ఇదే ప్రథమం అనీ, ఈ వంట పరికరం మూడు విధాలుగా పనిచేస్తుందనీ, వారు చెబుతున్నారు. పెనం మీద కాల్చినట్లు కాల్చడానికీ (రోస్ట్) నిప్పు మీద కాల్చడానికీ (టోస్ట్) వేపడానికీ (గ్రిల్) ఇది ఉపయోగపడుతుంది. దీనికి బయట గట్టి అద్దంతలుపు వుండడంతో, లోపల పదార్థాలు ఏ దశలో వున్నాయో సులభంగా తెలుసుకోవచ్చు. ఎలాంటి వంటకమైనా దీని ద్వారా సుళువుగానూ తొందరగానూ అయిపోతుందని కూడా ఉత్పత్తిదారులు చెబుతున్నారు. దీని సైజు : 16" × 11" × 11" ; పవర్ : 1200 వాట్స్ ; బరువు : 8 కిలోలు ; ఉష్ణోగ్రత : 100° సి నుండి 350° సి ; కెపాసిటీ : 15.5 లిటర్లు. దీని ధర మద్రాసులో రూ. 1180. (పన్నులు కాక) ఇంకా దీన్ని గురించిన వివరాలు తెలుసుకోవాలనుకుంటే – ట్రేడింగ్ ఇంజనీర్స్, 3/4A అసఫ్ ఆలీ రోడ్, న్యూ ఢిల్లీ–110002 చిరునామాకు రాయవచ్చును.

"ఎంత బాగా మాట్లాడ గలరండీ! నేను పేద దాన్ని అయినా నాకు మానాభిమానాలు వున్నాయి. మీ అబ్బాయివల్ల గర్భవతినయ్యాను గనక, దానికి ప్రతిఫలంగా మీనుండి డబ్బు రాబట్టుకోవాలనే ఉద్దేశంతో నే నిక్కడికి రాలేదు. మీ డబ్బు మీ దగ్గరే వుంచుకోండి ...ఇకపోతే మీరన్నట్లు డాక్టర్ని సంప్రదించాల్సి వస్తే డబ్బు అవుసరం అవుతుంది. కాని– నేను డాక్టర్ని సంప్రదించకపోతే...."

ఆశ్చర్యపోయారు ఆయన.

ఈసారి పిడుగు ఆయన నెత్తి మీద పడ్డట్టు ఖంగు తిన్నారు.

"అంటే....అంటే...."

"నేను కడుపు తీయించుకోడం లేదు."

మరీ ఆశ్చర్యపోయారాయన.

"మరి....మరి....ఏం చెయ్యాలనుకుంటున్నావు?" కంగారు కంగారుగా అడిగారు ఆయన. ఇంతసేపూ ఎంతో గంభీరంగా వున్న మనిషి శాంతి మాటలకు నీరసించిపోయారు.

"మరీ అంత కంగారుపడకండి. నే నేదో కోర్టు కెక్కి మీ ఆస్తిలో వాటా కావాలని దావా వెయ్యను. అటువంటి ఆలోచనలు కూడా మాలాంటి పేదవారికి రావు. మీలాంటి పెద్దింటివాళ్ళు ఆస్తుల కోసం కోర్టుల కెక్కుతారు. ఒకరి ప్రాణాల్ని మరొకరు తీసుకుంటారు. కాబట్టి నా విషయంలో మీరు నిశ్చింతగా వుండవచ్చు...." అభయం యిస్తున్నట్లుగా అంది శాంతి.

ప్రసాదరావుగారి మనసు శాంతించింది.

"అదికాదమ్మా! పెళ్ళికాకముందే కడుపు తెచ్చుకున్న 'పతిత' అనే అపకీర్తిని భరిస్తావా" ఆయన మాటల్లో శాంతికి నక్కవినయమే తొంగి చూసింది.

"చూడండి ప్రసాదరావుగారూ! నిర్భాగ్యులు, దౌర్భాగ్యులు ఈ దేశంలో చాలామంది వున్నారు. నేనూ ఆ కోవకు చెందినదాన్నే. అందుకే మీ సానుభూతి నా కనవసరం. కాని ఒక్కమాట మాత్రం గుర్తుంచుకోండి. మీరూహించినట్లు స్త్రీ ఎంతమందికి పడితే అంతమందికి మనసివ్వలేదు. స్త్రీ ఒకరికే మనసిస్తుంది. ఒకరినే ఆరాధిస్తుంది. ఆ వ్యక్తి కోసం ఆఖరికి ప్రాణాలను సైతం అర్పిస్తుంది. అదే మన పవిత్ర భారత దేశంలో స్త్రీ చేసుకున్న దౌర్భాగ్యం. నేనూ భారత స్త్రీనే....మీ ఉద్దేశం ప్రకారం నా కడుపులో పెరుగుతున్న ప్రాణాన్ని రూపుమాపుకొని మరొకరికి ఇల్లాల్ని కమ్మంటారు.

లిప్‌స్టిక్ వేసుకునేవారు వెంటనే ఒక చిన్న ఐస్ ముక్కను పెదవి మీద పెట్టి మెల్లిగా అదిమి తీయాలి. ఇలా చేస్తే – రంగు ఎండిపోకుండా, రోజంతా అలాగే వుంటుంది. —కల్పన

అంతేనా?....నో....అది ఎన్నటికీ జరగదు. గతాన్ని మరిచిపోయి, మరొకరి జీవితంలో ప్రవేశించి ఆ వ్యక్తి జీవితాన్నీ, నా జీవితాన్నీ నరకప్రాయం చేసుకోలేను. నాకు పెళ్ళి అయినా కాకపోయినా నేను మీ అబ్బాయి వల్లనే మాతృమూర్తిని కాబోతున్నాను. నాకున్న ఆశ అల్లా నా కడుపులో పెరిగే బిడ్డే. వాడి కోసమైనా జీవిస్తాను. ఆ బిడ్డ కోసమే నా సర్వస్వాన్నీ ధారపోస్తాను...ఇకపోతే....ఈ సంఘమూ, ఈ వ్యవస్థా అంటారా? వాటికి భయపడటం మానేశాను....నా జీవితాన్ని నాశనం చేసిన ఈ వ్యవస్థ కోసం నే నెందుకు భయపడాలి?...నా మీద సానుభూతి చూపించలేని ఈ సంఘం కోసం నే నెందుకు భయపడాలి?....నా జీవితాశయం వేరు....నా ఆదర్శాలు వేరు....అంతే....అంతే....నేను నమ్ముకున్న సిద్ధాంతాల కోసమే నేను బ్రతుకుతాను" ఆవేశంగా అంటున్న శాంతిని చూడటానికి కూడా ధైర్యం చాలలేదు ప్రసాదరావుగారికి.

ఆయనకు శాంతి విషయం యింత తేలిగ్గా పరిష్కారమవుతుందనిపించలేదు. శాంతి పదిమందినీ పిలిచి అల్లరిచేసి, తన ఇంటి పరువు బజారున పడేస్తుందనుకున్నాడు. లేకపోతే తన కొడుకు రాసిన ప్రేమ లేఖలు కోర్టులో పడేసి, ఆమె కడుపులో పెరుగుతోన్న ప్రాణాన్ని ప్రత్యక్ష సాక్ష్యంగా కోర్టులో ఋజువు చేస్తుందని భయపడ్డాడు. కాని తనూహించిన దేమీ జరగలేదు. శాంతికి నయానా భయానా ముందు నచ్చజెప్పి, వినకపోతే ప్రాణాలు తియ్యడానికైనా సంసిద్ధుడయ్యాడు తను. కాని జరుగుతున్న దేమిటి?....

శాంతి నిజంగా మంచి పిల్ల.

శాంతి ఎంతో ఉత్తమురాలు.

ఆమె ఆదర్శాల ముందూ, ఆశయాల ముందూ, ఆమె నిర్భయంగా వెల్లడించే అభిప్రాయాల ముందూ తను నిజంగా ఓడిపోయాడు.

'హాట్సాఫ్ శాంతి .... క్షణక్షణానికీ ఎదిగిపోతున్న నీ ఔన్నత్యానికీ, నీ ఔదార్యానికీ నేను తలొంచుతున్నాను....రియల్లీ....నేనే నీ ముందు ఓడిపోయాను' తనలో తనే అనుకున్నారు ప్రసాదరావుగారు.

అంతలోనే అభిమానం అడ్డొచ్చింది.

వంశ గౌరవమూ, ప్రతిష్ఠా, పరువూ అడ్డొచ్చాయి....

అంతలోనే-తనలో శాంతి యెడల ఏర్పడుతోన్న సద్భావాన్ని తుడిచేసుకొని, మళ్ళీ గంభీరంగా మారిపోయారు ప్రసాదరావుగారు.

శాంతి లేచి నిలబడింది.

వారించలేదు ప్రసాదరావుగారు.

శాంతి తన చేతివ్రేలికి వున్న ఉంగరాన్ని తీసి, ప్రసాదరావుగారికి ఇస్తూ — "ఇది మీ అబ్బాయి ఆలోచనా రహితంగా, ఆవేశంలో, నా శీలాన్ని అపహరించిన క్షణంలో నా చేతివ్రేలికి తొడిగాడు. కాని ఇది వుంచుకునేంత స్వార్థపరురాల్ని కాదు. మీ వస్తువు మీరే వుంచుకోండి" అంది.

ఆయన ఆ ఉంగరాన్ని అందుకున్నాడు.

శాంతి ఆయనకు నమస్కారం చేసి వెనక్కి తిరిగి గబగబ అడుగులేసుకుంటూ గేటు చేరుకుంది. గేటు తెరచుకుని రోడ్డెక్కి ఆఖరిసారిగా వెనక్కి తిరిగి ప్రసాదరావుగారి బంగళా వైపు చూసింది.

ఆశ్చర్యం!!

బాల్కనీలో నిలబడి తనవైపే చూస్తున్న రాజశేఖరం!!

ఒక స్త్రీ జీవితంతో ఆటలాడుకుని, ఆమె శీలాన్ని అపహరించి, ఆమెను నట్టేట్లో ముంచి, మరో స్త్రీ మెడలో త్వరలో తాళి కట్టబోతున్న నయవంచకుడు!

చేసిన వాగ్దానాలు నిలబెట్టుకోలేక, తండ్రిని ఎదిరించి ప్రేమించిన స్త్రీని పెళ్ళాడలేని వ్యక్తిత్వం లేని పిరికి వెధవ!

కసిగా అనుకుంది శాంతి.

అంతే! ఇంక అక్కడ ఒక్కక్షణం నిలబడలేకపోయింది. పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ బస్‌స్టాండు వైపు నడిచింది.

[ముగింపు వచ్చే సంచికలో]